ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
3★★★ జిల్లా వార్తలు
గురువారం 11 జూలై 2024



రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి 6
సహకార సంఘాల అభివృద్ధికి పెద్దపీట 6

- ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు
- వానాకాలం సాగులో కూలీల కొరతకు ఊరట
- రోజు కూలీ రూ.800 నుంచి రూ.వెయ్యి
- 2.42 లక్షల ఎకరాల్లో వానాకాలం సాగు

వరినాట్లకు వలస కూలీలు


ఇల్లంతకుంటలో వరి నాట్లు వేస్తున్న మహారాష్ట్ర కూలీలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

జిల్లాలో వానాకాలం సీజన్ పంటలు ప్రారంభమై దాదాపు రెండు నెలలవుతున్నా వరినాట్లు ఐదు శాతం కూడా దాటలేదు. జూలై మొదటి వారం నుంచి కొంత మేరకు వర్షాలు పడుతుండడంతో వరి నాట్లు మొదలయ్యాయి. స్థానికంగా కూలీల కొరత ఉండ డంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో ఉపాధి వెతుక్కుంటూ పొరుగు రాష్ట్రాల నుంచి జిల్లాకు వచ్చిన వలస కూలీలతో వరినాట్లలో వేగం పెరగనుంది. వందల కిలోమీటర్ల దూరం నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వివిధ మండలాలకు కుటుంబాలతో సహా వలస వచ్చారు. గతంలో కేవలం మగ కూలీలు మా త్రమే వచ్చేవారు. ఈ సారి మహిళలు కూడా రావడం విశేషం. పొలాల వద్దే రేకుల షెడ్లలో ఉంటూ గ్రూపులుగా వరినాట్లు వేస్తున్నారు.

● మూడేళ్లుగా పెరుగుతున్న వసల కూలీల రాక

జిల్లాకు మూడు సంవత్సరాలుగా వానాకాలం, యాసంగి సీజన్‌లలో వరినాట్లు వేయడానికి వచ్చే వలస కూలీల సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం వానాకలం సీజన్‌కు సంబంధించి వరినాట్లతోపాటు పత్తి, మిరప, ఇతర వ్యవసాయ పనులు సైతం చేస్తున్నారు. జిల్లాలో వరినాట్లకు సంబంధించి వలస కూలీలను రైతులు ఎక్కువగా ఉపయోగించు కుంటున్నారు. జిల్లాలోని మధ్యవర్తులు కొందరు బీహార్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, జార్ఖండ్, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్, రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకొస్తు న్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలకు ఎకరానికి రూ.5వేల నుంచి రూ. 6వేలవరకు వలస కూలీలకు చెల్లిస్తున్నారు. వలస వచ్చిన కూలీలు ఒక జట్టుగా ఏర్పడి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఐదు ఎకరాలక వరకు నాట్లు వేస్తున్నారు. 10 నుంచి 15 మంది వరకు ఉండే గ్రూపులో ముగ్గురు నుంచి నలుగురు నారు పంచగా మిగతా వారు నాట్లు వేస్తున్నారు. స్థానికంగా ఉండే కూలీలకు కూడా డిమాండ్ ఏర్పడింది. గతంలో రూ.300 నుంచి రూ.400 వరకు ఉండే కూలి ప్రస్తుతం మహిళా కూలీలకు రూ.800, మగ కూలీలకు రూ.వెయ్యి వరకు చెల్లిస్తున్నారు. దీంతోపాటు సిరిసిల్ల జిల్లాకు సరిహద్దులో ఉన్న సిద్దిపేట, కరీంనగర్, జగిత్యాల, కామారెడ్డి జిల్లాల నుంచి పొరుగు గ్రామాలకు వరినాట్లకు వచ్చే కూలీలకు రవాణా చార్జీలు అదనంగా చెల్లిస్తున్నారు. రైతులు మాత్రం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కూలీ లతో నాట్లలో వేగం పెరిగిందని చెప్పుకుంటున్నారు.

జిల్లాలో వానాకాలం సాగు (ఎకరాల్లో)

మండలం	సాగు అంచనా	ప్రస్తుతం
గంభీరావుపేట	19,535	314.1
ఇల్లంతకుంట	39,987	11,505.2
ముస్తాబాద్	24,239	843.31
సిరిసిల్ల	5417	904
తంగళ్లపల్లి	22,270	1422.21
వీర్నపలి	8095	268.25
ఎల్లారెడ్డిపేట	23,093	4548.2
బోయినపల్లి	21,150	4678.39
చందుర్తి	22,016	6097
కోనరావుపేట	24,295	4679.1
రుద్రంగి	10,857	3640
వేములవాడ	7820	5114
వేములవాడ రూరల్	14,340	2821.6
మొత్తం	2,42,766	4,68,335.36

అన్నీ పోనూ రూ.40 వేలు మిగులు

- రామ్‌కృష్ణ, వలస కూలీ, మహారాష్ట్ర



మాది మహారాష్ట్రలోని ధనోర గ్రామం. వ్యవసాయ కూలీ పనులు చేస్తూ కుటుంబాలను పోషిస్తుంటాం. మా ఊరిలో పనులు లేక ఏటా ఇక్కడకు వరి నాట్లు వేయడానికి వలస వస్తున్నాం. ఈ సారి మా కుటుంబంలోని మహిళలకు పని లేకపోవడంతో ఇక్కడకు తీసుకొచ్చాం. 20 కుటుంబాలతో రోజు నాట్లు వేస్తున్నాం. రెండు నెలలు పనులు చేస్తే అన్ని ఖర్చులు పోనూ ఒక్కొక్కరికి రూ.40 వేలు మిగులుతాయి.

పని లేక వలస వస్తున్నాం

- రంజన ఉమాశీ, మహిళ వలస కూలీ, మహారాష్ట్ర



మహారాష్ట్రలోని పట్గావ్ ఊరు మాది. మా ప్రాంతంలో వ్యవసాయ పనులు ఉన్న రోజుల్లో పని దొరుకుతుంది. ప్రస్తుతం అక్కడ పనులు లేవు. ఖాళీగా ఉండకుండా మావాళ్లతో కలిసి 20 రోజుల కిందట ఇక్కడకు వలస వచ్చాం. రోజుకు నాలుగెకరాల్లో వరి నాట్లు వేస్తున్నాం. రెండు నెలలపాటు కూలీ దొరు కుతుంది.

● బీడీలు వదిలి పొలం బాట

జిల్లాలో మహిళలకు ప్రధానంగా బీడీ పరిశ్రమతోనే ఉపాధి లభించేది. బీడీల కంటే వరినాట్లతో కూలి ఎక్కువగా వస్తుండడంతో గ్రామీణ ప్రాంతాల్లో బీడీలు చుట్టే కార్మికలు పొలంబాట పట్టారు. రోజంతా బీడీలు చుడితే రూ.200కు మించి లభించని పరిస్థితుల్లో వరినాట్లతో రూ.800 వరకు కూలీ లభించడం, సాయంత్రం వరకు పని ముగుస్తుండడంతో వ్యవసాయ పనులపై మహిళలు ఆసక్తి చూపుతున్నారు.

● జిల్లాలో 1.83 లక్షల ఎకరాల్లో వరిసాగు

జిల్లాలో వానాకాలం సాగు 2.42 లక్షల ఎకరాలు కాగా వరి 1.83 లక్షల ఎకరాలు లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం జిల్లాలో 4810 ఎకరాల్లోనే సాగు చేశారు. వల సకూలీలతో నాట్లు కొంత వేగంగా పెరిగాయి. వలస కూలీలతో ఇల్లంతకుంటలో 1169 ఎకరాలు, ఎల్లారెడ్డిపేటలో 1183 ఎకరాల్లో నాట్లు పడ్డాయి. గంభీరావుపేట 172, ముస్తాబాద్ 474, సిరిసిల్ల 140, తంగళ్లపల్లి 722, వీర్నపల్లి 60, బోయినపల్లి 101, చందుర్తి 392, కోనరావుపేట 359, రుద్రంగి 10, వేములవాడ 5, వేములవాడ రూరల్‌లో 23 ఎకరాల్లో అతి తక్కువగా నాట్లు వేశారు. వానాకాలం సీజన్‌లో పత్తి సాగు మాత్రం చివరి దశకు చేరుకుంది. 49215 ఎకరాలు లక్ష్యంగా ఉన్న పత్తి సాగులో 40568 ఎకరాల్లో విత్తనాలు వేసుకున్నారు. ఇతర పంటల్లో మొక్క జొన్న 813 ఎకరాలు, కందులు 588 ఎకరాల్లో విత్తనాలు వేశారు.

అంగన్‌వాడీ బడి.. అమ్మ ఒడి

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క


హాజరైన జిల్లా అధికారి లక్ష్మీరాజం

సిరిసిల్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలు అంటే అమ్మఒడి లాంటివని, టీచర్లు గ్రామాల్లో కుటుంబాలకు భరోసా ఇస్తూ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల విధివిధానాలపై మార్గనిర్దేశనం చేశారు. జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, అడిషనల్ సీడీపీవో సుచరిత వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో భద్రత, పౌష్టికాహారం, సంరక్షణ, మంచి భవిష్యత్ ఇస్తామని భరోసా కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రం పిల్లల ఎదుగుదలకు తోడ్పడుతుందని వివరించాల న్నారు. కేంద్రానికి ఎక్కువ మంది మహిళలు వస్తారని వారికి పౌష్టికాహారం అందించడం బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. సరైన పరిమాణంలో నాణ్యమైన సరుకులు ఇవ్వాలన్నారు. కాంట్రాక్టర్లు ఎవరైనా సరైన ఆహార పదార్థాలు, వస్తువులు సరఫరా చేయకపోతే అంగన్‌వాడీ టీచర్లు తిరస్కరించాలని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. వచ్చే సోమవారం నుంచి వారం రోజులపాటు అంగన్‌వాడీ బాట నిర్వహించాలని ఆదేశించారు. మాతా శిశు సంరక్షణ, ఆరోగ్య సంరక్షణకు వ్యాక్సినేషన్ వంటి కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు ఎంతో సేవ చేస్తున్నారని కొనియాడారు. జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై అడిగి తెలుసుకున్నారు.

మొక్కలు నాటే లక్ష్యాన్ని చేరుకోవాలి


మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 10: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మొక్కలు నాటే లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో మొక్కలు నాటడం, దానికి కావాల్సిన ఏర్పాట్లు చేయడంపై పలు శాఖలతో కలెక్టరేట్‌లో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని వివిధ శాఖలకు కేటాయించిన లక్ష్యం మేరకు ప్రణాళిక తయారు చేయాలన్నారు. గతంలో నాటిన మొక్కలు ఎండిపోయిన, పెరగకపోయిన వాటి స్థానంలో మళ్లీ నాటాలన్నారు. నాటిన మొక్కలకు తప్పకుండా జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. మొక్కలను నిత్యం పర్యవేక్షిస్తూ వాటిని సంరక్షించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఆర్డీవో శేషాద్రి, డీఈవో రమేష్ కుమార్, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి జితేందర్ రెడ్డి, ఉద్యాన శాఖ జిల్లా అధికారి జ్యోతి, డీఏవో భాస్కర్, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి పంచాక్షరి, డీఎంహెచ్‌వో సుమన్ మోహన్ రావు, నీటి పారుదల శాఖ ఈఈ సంత్ ప్రకాశ్ రావు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య అన్వేష్, మైనార్టీ సంక్షేమ శాఖ ఓఎస్డీ సర్వర్ మియా, ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆదాయం రూ.3.68 కోట్లు

వేములవాడ కల్చరల్, జూలై 10 : రాజన్న సిరిసిల్లలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి హుండీ ద్వారా రూ.3 కోట్ల 68 లక్షల 61 వేల 568 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వినోద్ రెడ్డి తెలిపారు. 39 రోజుల వ్యవధిలో భక్తులు వివిధ రూపాల్లో హుండీల్లో సమర్పించిన కానుకలను ఆలయ ఓపెన్ స్లాబ్‌లో రెండు రోజులు లెక్కించారు. మంగళవారం రూ.కోటి 88 లక్షల 69 వేలు, బుధవారం కోటి 79 లక్షల 91 వేలు లభించింది. రెండు రోజుల్లో 577.7 గ్రాముల బంగారం, 32 కిలోల 350 గ్రాముల వెండి ఆలయ ఖజానాకు సమకూరింది. ఏఈవోలు, సూపరిండెంట్‌లు, ఉద్యోగులు, కరీంనగర్ గోవిందా సతీసేవా సమితి స్వచ్ఛంద సేవకులు లెక్కింపులో పాల్గొన్నారు.

అగ్రహారం అంజన్నకు రూ.3.83 లక్షల ఆదాయం

వేములవాడ రాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయమైన అగ్రహారం హనుమాన్ ఆలయం హుండీ లెక్కింపును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజన్న ఖజానాకు రూ. 3 లక్షల 83 వేల 477 నగదు వచ్చినట్లు ఆలయ ఈవో మారుతి తెలిపారు. వ్యవస్థాపక వంశీయ ధర్మకర్త గౌరిశెట్టి మహేందర్ పాల్గొన్నారు.


వేములవాడలో హుండీ లెక్కిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

మొక్కలు నాటి సంరక్షించాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


మొక్క నాటుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జూలై 10: ప్రకృతిని కాపాడుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని, మొక్కలు నాటి సంరక్షించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని బాలానగర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం చేపడుతున్న వనమహోత్సవంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అటవీ సంపదను కాపాడుకోవడానికి చర్యలు తీసుకుంటోందన్నారు. రానున్న రోజుల్లో నీడనిచ్చే మొక్కలతోపాటు వన్యప్రాణులకు పండ్లనిచ్చే మొక్కలను పంపిణీ చేసేందుకు కృషి చేద్దామన్నారు. వన మహోత్సంలో భాగంగా నాటిన ప్రతీ మొక్కను కాపాడాలన్నారు. మున్సిపల్ కమిషనర్ అన్వేష్ వైస్ చైర్మన్ బింగి మహేష్ కౌన్సిలర్లు తిరుమల్‌రెడ్డి కవితసుమంత్‌రెడ్డి, నరాల శేఖర్, ఇప్పపూల అజయ్, జోగిని శంకర్, గోలి మహేష్ మేనేజర్ సంపత్‌రెడ్డి నాయకులు సంఘస్వామి, పుల్కం రాజు, సాగరం వెంకటస్వామి, అన్నారం శ్రీనివాస్, అంబాటి చంద్ర శేఖర్ యాదవ్ తదితరులు ఉన్నారు.





ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలి



సిరిసిల్ల కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 10: ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు చదువు దూరమైపోతున్నారని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం కలెక్టరేట్‌కు తరలివచ్చి నిరసన తెలిపారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని కార్మిక క్షేత్రమైన రాజీవ్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 326 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని వారందరికి విద్యను బోధించేందుకు ఐదుగురు ఉపాధ్యాయుల మాత్రమే పని చేస్తున్నారని ఈ విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటినుంచి ఉపాధ్యాయులను విద్యాశాఖ అధికారులు నియమించకపోవడంతో సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు చదువుకు దూరమైపోతున్నారని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మా పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించి మా పిల్లలకు చదువులను నేర్పించాలంటూ పిల్లల తల్లిదండ్రులు బుధవారం కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట బైటాయించి ధర్నా చేశారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ అక్కడి చేరుకుని ధర్నా చేస్తున్న తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రస్తుతం ఉపాధ్యాయుల బదిలీలు జరుగుతున్నాయని బదిలీలు ముగిసిన వెంటనే మీ పాఠశాలకు పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమిస్తామని హామీ ఇవ్వడంతో తల్లిదండ్రులు ధర్నాను విరమించారు.

ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసుకొని మోసం చేసిన వ్యక్తి అరెస్టు

వేములవాడ టౌన్, జూలై 10: వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన బొమ్మళ లక్ష్మి అనే మహిళ వద్ద ఉన్న ప్లాట్‌ను అక్రమంగా తన పేరుమీద రిజిస్ట్రేషన్ చేసుకుని డబ్బులు ఇవ్వకుండా కులం పేరుతో దూషించిన వ్యక్తిని అరెస్టు చేసి రౌడీ షీట్ ఓపెన్ చేసి రిమాండ్‌కు పంపినట్లు జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వివరాల ప్రకారం అనుపురం గ్రామానికి చెందిన లక్ష్మీ అనే మహిళ తిప్పాపూర్ గ్రామంలో ప్లాట్‌ను విక్రయించి తన కూతురు వివాహం చేయాలని చూసింది. దీంతో సదరు ప్లాట్‌ను వేములవాడ పట్టణానికి చెందిన వోద్యాల వేణు అనే వ్యక్తి తనకు విక్రయిస్తే రూ.6 లక్షలు ఇస్తానని నమ్మబలికి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. లక్ష్మికి ఇస్తానన్న డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తే 2022లో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే ఆ ప్లాట్‌ను ఎల్లారెడ్డిపేట మండలంకు చెందిన ఓ వ్యక్తికి అమ్మినట్లు తెలువగా పెద్ద మనుషులతో మాట్లాడి రూ. 8.50 లక్షలు ఇస్తానని ఒప్పుకుని ఒక లక్ష మాత్రమే ఇచ్చి మిగతా డబ్బులు ఇవ్వకుండా కులం పేరుతో తిడుతూ చంపుతానని బెదిరించడంతో లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయగా జిల్లా ఎస్పీ విచారణ చేసి నేరం రుజువు కావడంతో వేణును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అంతే కాకుండా అతనిపై గతంలో వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో, కరీంనగర్ వన్ టౌన్, టూ టౌన్‌లలో పలు చీటింగ్ కేసులు నమోదు నమోదయ్యాయని, బెదిరింపుల కేసులు, భూ సమస్యల్లో తలదూర్చి సెటిల్‌మెంట్ చేయడం వంటి కేసులతో పాటు అటెంప్ట్ మర్డర్ కేసులు ఉన్నాయని, ఎలాంటి నేరాలకు పాల్పడకుండా ఉండడానికి రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు పేర్కొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, జూలై 10: కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల గ్రామానికి చెందిన బుర్ర లక్ష్మయ్య(60) ఈనెల 9న సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా బుధవారం ఉదయం మృతి చెందాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. లక్ష్మయ్యను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. ఇరు కుల్లలో 2002లో సాదాబైనామా కాగితం ఒప్పందంతో ఇరుకుల్లకు చెందిన బుర్ర ఓదయ్య వద్ద 4 గుంటల భూమిని 8 లక్షల రూపాయలు ఇచ్చి కొనుగోలు చేయగా ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు విక్రయదారు మళ్లీ రెండు లక్షలు డిమాండ్ చేయటంతో పాటు దూషించాడని మనస్థాపం చెంది తన తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి కూతురు స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నలుగురిపై వీధి కుక్కల దాడి

సుభాష్‌నగర్, జూలై 10: కరీంనగర్ గంజ్ సమీపంలోని ఓ స్కూల్ దగ్గర వీధి కుక్కలు ముగ్గురు చిన్నారులు, వృద్ధురాలిపై దాడి చేశాయి. అక్కడే ఉన్న స్థానికులు గమనించి కుక్కలను వెళ్లకొట్టారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ ధర్నా

హుజూరాబాద్, జూలై 10: కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని కోరుతూ బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో పార్లమెంట్‌లో ఆమోదించుకున్న నాలుగు లేబర్ కోడ్‌లను, బొగ్గు బ్లాక్‌ల వేలంను రద్దు చేయడంతో పాటు ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలన్నారు. నాయకులు అజ్జు, సరోజన, రాజ్‌కుమార్, నర్సయ్య, సులోచన, రాజేశ్వరి, లత, పుష్పలత పాల్గొన్నారు.

నేషనల్ హైవే వాహనాల ద్వారా జరిగే ప్రమాదాలే ఎక్కువ

శంకరపట్నం, జూలై 10: హుజూరాబాద్ సబ్ డివిజన్ పరిధిలో ఫోర్‌లైన్ జాతీయ రహదారికి మట్టి తరలిస్తున్న వాహనాల ద్వారానే ప్రమాదాలు ఎక్కువ జరిగాయని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. బుధవారం కేశవపట్నం పోలీస్‌స్టేషన్లో రోడ్డు భద్రతా నియమాలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. డ్రైవర్లు ఓవర్ లోడ్, అధిక స్పీడ్‌తో వెళ్లడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల తీరును చూసి జడ్జి దిగ్భ్రాంతికి లోనయ్యారని సందర్భాన్ని గుర్తు చేశారు. ప్రమాదాల నివారణపై డ్రైవర్లకు అవగాహన సమావేశాలు నిర్వహించాలని జడ్జి సూచించారన్నారు.







ఓపీఎస్ అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి

● సీఎంకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాల అర్బన్, జూలై 10: ప్రభుత్వ ఉద్యోగ విరమణ అనంతరం విశ్రాంత జీవితంలో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవకుండా ఉద్యోగ సేవలకు ప్రతిఫలంగా, సామాజిక భద్రత కల్పించేందుకు పెన్షన్ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, తదనుగుణంగా సీపీఎస్ స్థానంలో ఓపీఎస్ విధానం అమలుకు ప్రభుత్వం చేపట్టాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004లో ఓల్డ్ పెన్షన్ స్థానంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం తెరపైకి తెచ్చారని, తెలంగాణ ప్రాంత ఉద్యోగులు ఓపీఎస్ అమలుకు దశాబ్దాలుగా పోరాటం చేసినా గత ప్రభుత్వం ఎలాంటి పరిష్కారానికి చొరవ చూపలేదన్నారు. సీపీఎస్ విధానంలో ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేసినప్పుడు పెన్షన్ పొందే అవకాశం లేకపోవడంతో అవసాన దశలో సామాజిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ప్రతి పౌరునికి పెన్షన్ ఇవ్వాలనే ఆదేశిక సూత్రాల్లో పేర్కొన్న విధంగా ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లను పరిగణలోకి తీసుకొని వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో సైతం పేర్కొన్నట్లుగా కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీం స్థానంలో ఓల్డ్ పెన్షన్ స్కీం విధానం అమలు చేసేందుకు పూర్తిస్థాయిలో అధ్యయనం చేపట్టాలని కోరారు. విశ్రాంత ఉద్యోగులకు సామాజిక భద్రత అందించడంతో పాటు ఆత్మగౌరవంతో జీవించ గలిగే పరిస్థితులు నెలకొల్పేందుకు చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు అండగా ఉంటుందని వారి సమస్యలు పరిష్కరిస్తుందన్నారు.

నిర్మించారు.. వదిలేశారు

● నిరుపయోగంగా వ్యవసాయ శాఖ, స్త్రీశక్తి భవనాలు ● వినియోగంలోకి తీసుకురావాలంటున్న ప్రజలు



మరమ్మతులకు నోచుకోని వ్యవసాయ శాఖ భవనం



నిరుపయోగంగా ఉన్న స్త్రీశక్తి భవనం

కథలాపూర్, జూలై 10: లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనాలు పనికి రాకుండా పోతున్నాయి. అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టకపోవడంతో మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలకు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తారు. అయితే ప్రజలకు అనువుగా ఉండడమే కాకుండా సిబ్బందికి అనుకూలంగా ఉండే విధంగా నిర్మించాల్సి ఉండగా దాన్ని విస్మరించారనే చర్చ జరుగుతోంది.

మహిళా స్వశక్తి భవనం ఉపాధి హామీ పథకం కింద వెచ్చించిన సుమారు రూ.26 లక్షలతో ఆరేళ్ల క్రితం నిర్మించారు. అధికారులు, సిబ్బంది కోసం మూడు గదులు, సమావేశాల నిమిత్తం ప్రత్యేకంగా గది నిర్మించారు. అయితే ఆ సమయంలో ఇరుకుగా ఉన్న దర్వాజలు పెట్టడం వల్ల బెంచీలు, కుర్చీలు, టేబుళ్లు కార్యాలయంలోకి తీసుకువెళ్లడానికి వీలు లేని పరిస్థితి ఉంది. దీంతో ప్రస్తుతం ఉన్న కార్యాలయాలన్ని నూతన భవనంలోకి మార్చడానికి వీలు లేని దుస్థితి ఏర్పడింది. దీనికి తోడు ఫ్లోరింగ్ పూర్తిగా దెబ్బతినడం వల్ల కనీసం సమావేశాలు ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కొత్త భవనం నిర్మించినా ఫలితం లేకుండా మారింది. అదేవిధంగా వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది కోసం నిర్మించిన భవనం తలుపులు ఊడిపోయి, ఫ్లోరింగ్ చెడిపోవడం వల్ల కొంత కాలంగా భవనం తెరుచుకోవడమే లేదు. ఈ నేపథ్యంలో వ్యవసాయ అధికారి కార్యాలయం లేక ఇటు సిబ్బంది, అటు రైతులు అవస్థలు పడుతున్నారు. భవనానికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేస్తేనే అందుబాటులోకి వచ్చే పరిస్థితి కనిపిస్తోంది.

మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు నివేదించాం

నరహరి, సెర్ప్ ఏపీఎం



స్త్రీశక్తి భవనం పూర్తి చేసినప్పటికీ తమకు అందుబాటులోకి రావడం లేదు. దర్వాజాలు ఇరుకుగా నిర్మించినందువల్ల కనీసం కుర్చీలు కూడా భవ నంలోకి తీసుకెళ్లలేని పరిస్థితి. ఫ్లోరింగ్ పూర్తిగా ధ్వంసమైంది. మహిళలతో సమావేశాలు కూడా నిర్వహించడానికి వీలు లేదు. కొత్త భవనమే అయినా తాము వినియోగించుకోలేక పోతున్నాం. మరమ్మతులు చేయించాలని ఏపీడీతో చర్చించాం.ఇంజినీర్‌తో అంచనాలు వేయించి ఉన్నతాధికారులకు నివేదించనున్నాం.

ముగిసిన ఎన్టీపీసీ దక్షిణ రీజియన్ స్పోర్ట్స్ మీట్

● బ్యాడ్మింటన్‌లో విజేత రామగుండం జట్టు



బ్యాడ్మింటన్ విజేత రామగుండం ఎన్టీపీసీ జట్టు

జ్యోతినగర్, జూలై 10: రామగుండం ఎన్టీపీసీలో జరిగిన ఎన్టీపీసీ దక్షిణ రీజియన్ స్పోర్ట్స్ మీట్(ఎస్ఆర్ఎస్ఎం) 2024లో బ్యాడ్మింటన్ విభాగంలో రామగుండం ఎన్టీపీసీ మహిళలు, క్రికెట్‌లో సింహాద్రి ఎన్టీపీసీ పురుషుల జట్లు చాంపియన్లుగా నిలిచాయి. నాలుగు రోజులుగా జరుగుతున్న ఎస్ఆర్ఎస్ఎం బుధవారం ముగిసింది. ఎన్టీపీసీ పీటీఎస్‌లోని స్పందన ఇండోర్ స్టేడియంలో జరిగిన మహిళల బ్యాడ్మింటన్ ఫైనల్ పోటీలో రామగుండం జట్టు సింహాద్రి(విశాఖపట్నం) జట్టుపై విజయం సాధించింది. అలాగే మహాత్మాగాంధీ స్టేడియంలో రామగుండం, సింహాద్రి జట్ల మధ్య ఫైనల్ పోరులో సింహాద్రి ఎన్టీపీసీ గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన రామగుండం ఎన్టీపీసీ జట్టు 90 పరుగులకే ఆలౌట్ అయింది. 91 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన సింహాద్రి ఎన్టీపీసీ జట్టు 16 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. అనంతరం జరిగిన స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమానికి ఎన్టీపీసీ ఆర్ఈడీ(సౌత్) ప్రేం ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు. అలాగే ప్రతిభ కనబర్చిన ప్లేయర్లకు బహుమతులను అందజేశారు. నాలుగు రోజులపాటు జరిగిన పోటీలలో రామగుండం, సింహాద్రి, కుడిగి(కర్నాటక), వల్లూర్(తమిళనాడు), ఎస్ఆర్‌హెచ్‌క్యూ) హైదరాబాద్ ఎన్టీపీసీ జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఆర్ఈడీ ప్రేం ప్రకాష్ ప్రసంగిస్తూ ఎన్టీపీసీ ఉద్యోగులు క్రీడలపట్ల ఆసక్తి కనబర్చాలని, నిత్యం వ్యాయామం, నడక కొనసాగించాలన్నారు. ప్రధానంగా క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం కలుగుతుందన్నారు. రానున్న కాలంలో ఎస్ఆర్ఎస్ఎం పోటీలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రావగుండం, తెలంగాణ ప్రాజెక్టు ఈడీ కేదార్ రంజన్ పాండు, ఎన్‌బీసీ సభ్యుడు బాబర్ సలీంపాషా, ఎస్ఆర్ హెచ్‌క్యూ సీజీఎం(హెచ్ఆర్) పాణిగ్రహి, ఎన్టీపీసీ స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్ తివారి, భానేశ్వర్, హెచ్ఆర్ ఏజీఎం సిక్దర్, అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సెప్టింక్ ట్యాంకులో పడ్డ బాలుడి మృతి

పెద్దపల్లిటౌన్, జూలై 10: పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం సెప్టింక్ ట్యాంకులో పడి అస్వస్థతకు గురైన బాలుడు కరీంనగర్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన మహబూబ్‌నగర్‌కు చెందిన రాములమ్మ శ్రీనివాసుల కొడుకు జాన్‌వెస్లీ (7) మంగళవారం సెప్టిక్ ట్యాంక్‌లో పడి తీవ్ర అస్వస్థతకు గురైన విషయం విదితమే. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆస్పత్రి నిర్లక్ష్యం వల్ల బాలుడు మృతి చెందాడని మా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బాలుడి కుటుంబీకులు కోరారు.

గీత కార్మికుడికి గాయాలు

కోనరావుపేట, జూలై 10: ధర్మారం గ్రామానికి చెందిన అతికెం శ్రీనివాస్‌గౌడ్ అనే గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి పడగా తీవ్రగాయాలయ్యాయి. బుధవారం ఉదయం కళ్లు గీయడానికి తాటి చెట్టు ఎక్కి దిగుతుండగా మోకు జారి కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్రగాయాలు తోటి గౌడ కులస్థులు హుటాహుటిన చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఆస్పత్రికి తరలించారు.

గ్రూప్-1 మెయిన్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, జూలై 10: గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఔత్సాహికులు తమ దరఖాస్తులను వెబ్‌సైట్ www.tgbc-studycircle.cgg.gov.inలో ఈ నెల19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ ఈ నెల22న మొదలవుతుందన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్షలలోపు ఉండాలన్నారు. ఎంపికైన వారికి శిక్షణ కాలంలో నెలకు రూ.5000 ఉపకార వేతనం అందజేస్తామన్నారు. ఉచిత శిక్షణ హైదరాబాద్ సైదాబాద్‌లోని టీజీ బీసీ స్టడీ సర్కిల్, ఖమ్మంలోని టీజీ బీసీ స్టడీ సర్కిల్‌లలో అందజేస్తారన్నారు. మరింత సమాచారం కోసం 040-24071178 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తికి గాయాలు

శంకరపట్నం, జూలై 10: శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామంలో కారు ఢీకొన్న ఘటనలో బుధవారం మతిస్థిమితం లేని వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నాపూర్ సొసైటీ గోదాం సమీపంలో అదే గ్రామానికి చెందిన నక్క గట్టయ్య అనే మతిస్థిమితం లేని వ్యక్తిని కారు ఢీకొట్టిందన్నారు. తీవ్ర గాయాలైన గట్టయ్యను స్థానికుల ఆస్పత్రికి తరలించారు.

నా పిల్లలన్నాడు.. మొహం చాటేశాడు

● జైలు జీవితం అనుభవించి సత్ప్రవర్తన కింద బయటకు ● పిల్లలను వదిలేసి వెళ్లిన తండ్రి

జమ్మికుంట/జమ్మికుంట రూరల్, జూలై 10: భార్య మృతి చెందిన కేసులో పద్నాలుగేళ్ల జైలు జీవితం అనుభవించిన ఓ తండ్రి ఆనాధాశ్రమంలో ఉన్న తన పిల్లల వద్దకు వచ్చాడు. ఇన్నాళ్లు పిల్లలకు దూరం అయ్యానని, నా అన్న వారు తెలియకుండా పెరిగారని, ఇకపై తన వద్ద పెట్టుకుంటానని, వారికి ఏ లోటు రాకుండా చూసుకుంటానని కల్లబొల్లి మాటలు చెప్పి వెంట తీసుకు వెళ్లాడు. రెండు రోజులు గడువక ముందే హైదరాబాద్ చెక్కేశాడు.

జమ్మికుంట మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన సామ సారయ్య సత్తెమ్మ దంపతులకు కుమార్తె పూజ, కుమారుడు బన్ని ఉన్నారు. కుటుంబ కలహాలతో తీవ్ర కోపోద్రిక్తుడైన సారయ్య భార్య సత్తెమ్మ ను వెనక్కి నెట్టడంతో మృత్యువాత పడింది. ఈ సంఘటన 2010సంవత్స రంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనలో సారయ్యకు జీవిత ఖైదు పడింది. ఆ సమయంలో పూజ 5సంవత్సరాలు, బన్ని 4సంవత్సరాలు ఉన్నారు. పోలీ స్‌ల సహకారంతో జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో గల స్పంధన ఆనాధాశ్రమంలో పిల్లలను చేర్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 3న సత్ప్రవర్తన కింద సారయ్యను విడుదల చేయగా నేరుగా ఆనాధాశ్రమంకు చేరుకున్నాడు. ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లిలో ఇళ్లు అద్దెకు తీసుకున్నానని, పిల్లలను కూడా తన వెంట ఉంచుకుంటానని, ఇకపై వారికి ఏ లోటు రానివ్వనని కల్లబొల్లి మాటలు చెప్పి ఆశ్రమం నిర్వాహకుడిని నమ్మించాడు. ఈ నెల 4న పూజ, బన్నిలను తీసుకెళ్లాడు. మరుసటి రోజు హైదరాబాద్ వెళ్లాస్తానని, జైలు అకౌంటెంట్ ఫోన్ చేశాడని, మనకు డబ్బు లు వచ్చేవి ఉన్నాయని, తీసుకువస్తానని చెప్పి తెల్లవారు జామున 5గం టలకు ఇంటి నుంచి వెళ్లాడు. సాయంత్రం 5గంటలకు ఫోన్ చేసి మీరు నా పిల్లలు కాదు, నాకు పుట్టలేదు, సర్టిఫికెట్లపై నా పేరు తీసివేయాలని, తాను మరో వివాహం చేసుకుంటున్నాని, నా పేరిట ఉన్న కొద్దో గొప్పో ఆస్తిని వారి కే ఇచ్చేస్తానని చెప్పి అతనిలో ఉన్న కసాయి తనాన్ని నిరూపించుకున్నాడు. ఒక్కసారి షాక్ గురైన పూజ, బన్నిలు కన్నీంటి పర్యాంతమై తనను చేరదీసిన ఆశ్రమం బాటపట్టారు. వారిని చూసి చలించిన ఆశ్రమం నిర్వాహకుడు గోపరాజు వీరస్వామి దగ్గరకు తీసుకుని ఏం జరిగిందో అడిగి తెలుసుకున్నాడు. మీకు నేను ఉన్నా, మీరు అధైర్యపడద్దని ధైర్యం చెప్పి లోనికి తీసుకువెళ్లి భోజనం పెట్టాడు. వారి తండ్రి చేసిన పని తెలు సుకున్న తోటి పిల్లలు కోపంతో రగిలి పోయారు.



ఆశ్రమానికి వచ్చిన పూజ, బన్ని

రామడుగు ఎస్ఐతో ప్రాణహాని

●వెలిచాలకు చెందిన కుతాడి కనకయ్య ఆరోపణ

సుభాష్‌నగర్, జూలై 10: రామడుగు ఎస్ఐతో తనకు ప్రాణహాని ఉందని వెలిచాల గ్రామానికి చెందిన కుతాడి కనకయ్య, అతడి భార్య అనిత తెలిపారు. బుధవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో కుతాడి కనకయ్య మాట్లాడుతూ దొంగతనం విషయంలో తప్పుడు ఫిర్యాదు చేయడంతో ఎలాంటి విచారణ చేయకుండా పోలీసులు తనను కొట్టి కేసు నమోదు చేశారని ఆరోపించారు. ఏప్రిల్‌లో జరిగిన గొర్రెల దొంగతనం కేసులో తనను అన్యాయంగా ఇరికించారని, నేరాన్ని ఒప్పుకోవాలని చిత్రహింసలకు గురి చేసిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని కోరారు. జూన్ 11న ఇంట్లో నిద్రిస్తున్న తనను తెల్లవారుజామున 4గంటలకు రామడుగు పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి విపరీతంగా కొట్టారని ఆరోపించాడు. అదేరోజు కరీంనగర్‌కు తరలించి మళ్లీ కొట్టారని, లేవలేని స్థితిలో ఉన్న తనను జూన్ 12న రాత్రి 10 గంటలకు ఇంటికి పంపించారని తెలిపారు. 8 మంది కానిస్టేబుల్స్, ఒక ఎస్ఐ కలిసి తనను విపరీతంగా కొట్టారని ఆరోపించారు. ఎస్ఐపై తగు చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కుతాడి కనకయ్య కోరాడు. అనంతరం కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్ మాట్లాడుతూ పోలీసు స్టేషన్‌లో విచారణ పేరుతో చిత్రహింసలకు గురి చేసిన ఎస్ఐని సస్పెండ్ చేయాలని కోరారు. సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి కె.నాగరాణి, పుష్పలత, రాణి తదితరులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ : ఇద్దరికి గాయాలు

శంకరపట్నం, జూలై 10: శంకరపట్నం మండలం మొలంగూర్ ఎక్స్ రోడ్ వద్ద బుధవారం రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. సైదాపూర్ మండలంలోని బూడిదపల్లి గ్రామానికి చెందిన పడాల వెంకటస్వామి తన భార్య రాజేశ్వరితో కలిసి మొలంగూర్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో మొలంగూర్ గ్రామానికి చెందిన తడిగొప్పుల సంపత్ ఎదురుగా వస్తున్నాడు. రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో పడాల వెంకటస్వామికి, సంపత్‌లకు స్వల్పగాయాలు కాగా 108వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, జూలై 10: కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తిలో కరీంనగర్ రూరల్ పోలీసులు రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని పోలీసు ఠాణాకు తరలించి కేసు నమోదు చేశారు. కాగా గ్రామంలో భారీగా ఇసుకను నిలువ చేసినట్లుగా మైనింగ్, పోలీసుల తనిఖీల్లో వెల్లడైంది.

చోరీ కేసులో 8 నెలల జైలు శిక్ష

చిగురుమామిడి, జూలై 10: మండలంలో కొండాపూర్ గ్రామంలో గత సంవత్సరం నవంబరు 8 తేదీన ఇదే గ్రామానికి చెందిన దరిపల్లి లచ్చవ్వ అనే వృద్ధురాలిని మోసం చేసి పర్వతం రాజు అనే వ్యక్తి బంగారు ఆభరణాలు దొంగిలించిన కేసులో 8 నెలల జైలు శిక్ష పడినట్లు ఎస్సై బండి రాజేశ్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్యాస్ స్టౌవ్ రిపేర్ చేస్తానని చెప్పి పర్వతం రాజు అనే వ్యక్తి ఆమె ఒంటిపై ఉన్న కమ్మలు, ఇతర బంగారు వస్తువులను దొంగలించి పారిపోయాడు. దీనిపై కేసు నమోదు అయింది. దీనిపై ఎక్సైజ్ శాఖ కోర్టు నేరస్తునికి ఎనమిది నెలల జైలు శిక్ష, వెయ్యి రూపాయాల జరిమానా విధించినట్లు తెలిపారు. ఇప్పటికైనా గ్రామాల్లోకి గుర్తు తెలియని వ్యక్తులు వస్తే వెంటనే పోలీస్‌లకు సమాచారం అందించాలని తెలిపారు.

పీహెచ్‌సీ ఏర్పాటు ఎప్పుడో?

● మంజూరైనా స్థల సేకరణలో జాప్యం ● పొంచిఉన్న వ్యాధుల ముప్పు

గన్నేరువరం, జులై 10: గన్నేరువరం మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేకపోవడంతో ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్యం కోసం పక్క మండలమైన తిమ్మాపూర్, జిల్లా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. తిమ్మాపూర్‌కు 30 కిలోమీటర్లు, జిల్లా ఆసుపత్రికి 40 కిలోమీటర్ల దూరం వెళ్ళవలిసి వస్తుంది. అత్యవసర సమయాల్లో దూరభారంతో చికిత్స అందక ప్రాణాలు పోయే పరిస్థితి నెలకొంది. సాధారణ పరీక్షలకు వెళ్లే గర్భిణీలు పీఎచ్‌సీ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో గన్నేరువరం, ఖాసింపేట, జంగపల్లి, గునుకుల కొండాపూర్ గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు ఉండగా వీటిని పల్లె దవాఖానాలుగా మార్చారు. వీటిలో గన్నేరువరం, జంగపల్లి సబ్‌సెంటర్ లకు ఎంఎల్‌ఎచ్‌పీలుగా ఉపేందర్, సాహితి డాక్టర్లను నియమించారు. మిగతా రెండు సబ్ సెంటర్‌లలో డాక్టర్లు లేక ఏఎన్ఎంలు విధులు నిర్వహిస్తున్నారు. మండలంలో ఇద్దరు హెల్త్ అసిస్టెంట్‌లు ఉండగా ప్రస్తుతం వారు ఇరువురు వేరే మండలానికి బదిలీ కాగా మండలానికి హెల్త్ అసిస్టెంట్ లేకపోవడంతో ఏఎన్ఎంలపై భారం పడింది. ప్రస్తుతం తిమ్మాపూర్ పీఎచ్‌సీ డాక్టర్ ప్రణవ్ మండలానికి ఇంచార్జిగా ఉన్నారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై, పరిసరాల పరిశుభ్రతపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించడానికి సైతం సిబ్బంది లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



పీహెచ్‌సీ కోసం స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి(ఫైల్)

స్థల సేకరణపై స్పష్టత కరువు

మండలానికి పీఎచ్‌సీ మంజూరుకావడంతో గత సంవత్సరం నవంబర్‌లో పీఎచ్‌సీ నిర్మాణం కోసం ఖాసింపేట చౌరస్తా వద్ద స్థలాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మండల అధికారులతో కలిసి పరిశీలించారు. అట్టి స్థలంలో పీహెచ్‌సీ నిర్మిస్తే మండలంలోని వివిధ గ్రామాలకు అనుకూలంగా ఉంటుందని ప్రజాప్రతినిధులు, ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు. నేటి వరకు పీహెచ్‌సీ నిర్మాణంపై ఎలాంటి స్పష్టత రాలేదు.

ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు మరమ్మతులు నిలిపివేత

● ఆర్అండ్‌బీ అధికారుల నివేదిక కోరిన కలెక్టర్

హుజూరాబాద్, జూలై 10: హుజూరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వాస్తు పేరిట అనాధికారికంగా మరమ్మతులు చేస్తుండగా బుధవారం పనులను ఆర్అండ్‌బీ అధికారులు నిలుపుదల చేసినట్లు తెలిసింది. ఈ ఎమ్మెల్యే క్యాంపు వ్యవహారంపై జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సమగ్ర నివేదిక ఇవ్వాలని రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ భవనం వాస్తు ప్రకారం లేదనే కారణంతో పోర్టికో, కిటికీలు, తలుపులను, గోడలను తొలగిస్తున్న విషయం సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. దీంతో పాటు స్థానిక కాంగ్రెస్, బీజేపీ నాయకులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే పనులను నిలుపుదల చేసి నివేదిక అందించాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ పనులు నిలిపివేయడంపై హుజూరాబాద్‌లో చర్చనీయాంశంగా మారింది.

● ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరుగుతున్న మరమ్మతు పనులను నిలిపివేయాలని కోరుతూ కాంగ్రెస్ నాయకుడు నేరేళ్ల మహేందర్‌గౌడ్, బీజేపీ నాయ కుడు బింగి కరుణాకర్‌లు బుధవారం ఆర్డీవో, ఏసీపీలకు ఫిర్యాదు చేశారు.

యువతి ఆత్మహత్య

వెల్గటూర్, జూలై 10: మండలంలోని శాఖాపూర్ గ్రామానికి చెందిన రంగం పూజిత (19) అనే యువతి మంగళవారం ఉరి వేసుకొని మృతి చెందగా బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలు పూజిత సంవత్సర కాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంటిలో ఎవరూ లేని సమయంలో రేకుల షెడ్డుకు చున్నీతో ఉరి వేసుకొని మంగళవారం మృతి చెందింది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అటవీ గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

వీర్నపల్లి, జూలై 10: అటవీ గ్రామాల్లో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నివసించేందుకు పోలీస్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు. వీర్నపల్లి మండలంలోని జవహర్‌లాల్ నాయక్ తండా, సీతారాం నాయక్ తండా, బండ తండాతోపాటు ఆయా తండాల ప్రధాన రహదారి వెంట ఎల్లారెడ్డిపేట సర్కిల్ పోలీసులు బుధవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యలు ఎదురైతే పోలీసులను సంప్రదించాలన్నారు. గంభీరావుపేట ఏఎస్సై ప్రభాకర్‌రెడ్డి, ఎల్లారెడ్డిపేట హెడ్‌కానిస్టేబుల్ పాషా పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

జగిత్యాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. బుధవారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టులోకి 1,852 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 90.323 సామర్థ్యంకు ప్రస్తుతం 12.324 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 16.964 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూన్ 1 నుంచి ప్రాజెక్టులోకి 6.418 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి



హన్మంతు (ఫైల్)

మానకొండూర్, జూలై 10 : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ గ్రామానికి చెందిన మోదుంపల్లి హన్మంతు (56) అనే వ్యక్తి బుధవారం తన ఇంటి సమీపంలోని కరీంనగర్- జమ్మికుంట ప్రధాన రహదారిపై నుంచి బహిర్భూమికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో హన్మంతుకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు 108 వాహనం ద్వారా కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య లస్మమ్మ, కుమారుడు గోపి ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

రూ.7,600 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూలై 10: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,600 పలికింది. పదిహేను రోజుల క్రితం పత్తి ధర రూ.7,300 పలికింది. క్రమేపీ పెరుగుతూ వస్తూ ప్రస్తూతం రూ.7600 చేరుకుంది. బుధవారం మార్కెట్ యార్డుకు 17మంది రైతులు 293క్వింటాళ్ల విడి పత్తిని విక్రయానికి తీసుకు వచ్చారు. బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7600, కనిష్ఠ ధర రూ.7400 చెల్లించి ప్రైవేట్ వ్యాపారులు పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

చెరువు ఆక్రమణపై అధికారుల విచారణ

మల్యాల, జూలై 10: మల్యాలలోని పలు చెరువులు ఆక్రమణకు గురి అవుతుండడంతో అధికారులు బుధవారం పరిశీలించి పలు ఫిర్యాదులపై విచారణ జరిపారు. మల్యాలలోని చెరువులు ఆక్రమణకు గురి అవుతున్నాయని కాపాడి తమ జీవనోపాధి కోల్పోకుండా చర్యలు తీసుకోవాలంటూ స్థానిక గంగపుత్ర సంఘం సభ్యులు నెల రోజుల క్రితం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చెరువులో మట్టి నింపుతుండడంతో విస్తీర్ణం తగ్గడమే కాకుండా చేపల పెంపకానికి ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్, రెవెన్యూ, మత్స్య శాఖ అధికారులు మల్యాలలోని నూరప్ప, మత్తడి చెరువులను పరిశీలించారు. చెరువుల వద్ద మట్టి నింపుతున్నట్లు అధికారుల విచారణలో తేలడంతో చర్యల కోసం పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. విచారణ జరిపిన వారిలో డీఈ తిరుపతి, ఆర్ఐ తిరుపతి, గంగపుత్ర సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

రైలు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

ఓదెల, జూలై 10 : మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం గుర్తు తెలియని రైలు ఢీకొని శ్రీరామోజు స్వస్తిక్ అనే యువకుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. మండలంలోని కనగర్తికి చెందిన స్వస్తిక్ మధ్యాహ్నం ఓదెలకు వచ్చినట్లు సమాచారం. సాయంత్రం వేళల్లో రైల్వే స్టేషన్ వైపు వెళ్లిన వ్యక్తి గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో ముఖం నుజ్జునుజ్జు అయ్యింది. కొన ఊపిరితో ఉన్న స్వస్తిక్‌ను 108 అంబులెన్స్ ద్వారా కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యపరిస్థితి విషమంగా ఉంది.

హాస్టల్స్, హోటల్స్‌లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ

ధర్మపురి, జూలై 10: ధర్మపురి పట్టణంలోని మైనార్టీ జూనియర్ కళాశాలను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ స్కూల్‌లో నాసిరకంగా ఉన్న చెడిపోయిప కూరగాయలను బయట పడవేయించారు. అలాగే ఫాస్ట్ ఫుడ్ సెంటర్, హోటల్స్, బేకరీలను కూడ తనిఖీ జరిమానాలు విధించారు. స్థానిక లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో అన్నదానం, ప్రసాద విక్రయశాలను పరిశీలించి ప్రసాదాలను టెస్టింగ్ కోసం ఆమె వెంట తీసుకెళ్లారు. ప్రతీ ఒక్కరు నాణ్యత ప్రమాణాలు, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆమె సూచించారు.

మోడల్ స్కూల్‌ను సందర్శించిన ఎస్ఆర్‌టీ అధికారి

కొడిమ్యాల, జూలై 10 : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలను బుధవారం స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రేనింగ్(ఎస్ఆర్‌టీ) అధికారి భరణి ఆకస్మికంగా సందర్శించారు. మోడల్ స్కూల్‌లో పరిశుభ్రత, బోధన విధానం, మధ్యాహ్న భోజనం, క్రీడా మైదానం, వృత్తి విద్యా కోర్సులకు సంబంధించిన పలు అంశాలను పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. తరగతి గదిలో విద్యార్థులకు ఉపాధ్యాయులు చేస్తున్న బోధన తీరును ప్రత్యక్షంగా పరిశీలించి అభినందించారు. ఈ సందర్శనలో ప్రిన్సిపాల్ బి లావణ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

స్కైలాబ్ @ 45ఏళ్లు

చొప్పదండి,జూలై10: స్కైలాబ్‌కు నేటితో 45ఏళ్లు నిండాయి. 1979 జూన్, జూలై నెలలో పైనుంచి ఏదో పడుతుందని ఇక బతుకలేమంటూ అంతటా ప్రచారం జరిగింది. ఇక చనిపోతామంటూ ప్రజలు కన్నీళ్లు పెట్టుకున్నారు. స్కైలాబ్ అనే ఉపగ్రహం ఆకాశంలో గతి తప్పిందని భూమిపై కూలి పోతుందని శాస్త్రవేత్తలు ప్రకటించగా ప్రజల్లో భయాందోళనలు పెరిగిపోయాయి. ఇక బతుకలేమంటూ కొంతమంది విలువైన సంపదను విక్రయించుకొని విందులు చేసుకున్నారు. కరీంనగర్ జిల్లాలోనే స్కైలాబ్ పడుతుందని వదంతులు వ్యాపించాయి. 1979 జూలై 11న స్కైలాబ్ ఉపగ్రహాన్ని సాంకేతిక పరిజ్ఞానంతో సముద్రంలో దింపామని రేడియోలో వార్తలు రావడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. విందులు చేసుకున్నారు. ప్రజలందరూ స్కైలాబ్ పడ్డరోజున గడగడలాడిపోయారు. అయితే ఆ రోజు కొందరికి తీపిగుర్తుగా మిగిలిపోయింది.అప్పుడు పుట్టిన వారికి గ్రామాలలో స్కైలాబ్‌గా పేరు పెట్టుకున్నారు.

పేరులోనే ప్రత్యేకత

కందుల స్కైలాబ్ గౌడ్, మంగళపల్లి



స్కైలాబ్ పడ్డరోజు పుట్టడంతో తల్లిదండ్రులు స్కైలాబ్ గౌడ్‌గా నామకరణం చేశారు. అందరి కన్నా తన పేరులో ప్రత్యేకత కలిగి ఉండడం సంతోషంగా ఉంది. నేను పుట్టిన రోజున దేశమంతా గడగడలాడిపోయి అంతా ఊపిరిపీల్చుకోవడం గర్వకారణంగా ఉంది,

సహకార సంఘాల అభివృద్ధికి పెద్దపీట

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



పెట్రోల్‌పంప్ ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్

చందుర్తి, జూలై 10: సహకార సంఘాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మూడపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పెట్రోల్ బంక్‌ను నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావుతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘం ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు అభినందనీయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో 9 ప్రాజెక్టులలో మొదటి క్రమంలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును చేర్చారని, ఇందులో భాగంగా కలికోట సూరమ్మ చెరువు పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని తెలిపారు. కొత్తగా నూకలమర్రిలో లొంక చెరువును ఆశిరెడ్డిపల్లిలో కొత్తచెరువు, సనుగుల ఎర్ర చెరువు పటేల్ చెరువులను అనుసంధానం చేయడానికి సంకల్పించమన్నారు. అనంతరం కొండూరు రవీందర్‌రావు మాట్లాడుతూ సొసైటీలు రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నాయన్నారు. సింగిల్‌విండో చైర్మన్లు తిప్పని శ్రీనివాస్, కిషన్‌రావు, ఏనుగు తిరుపతిరెడ్డి, తహసీల్దార్ శ్రీని వాస్, ఎంపీడీవో ప్రదీప్, సీఈవో గంగారెడ్డి,సెస్ డైరెక్టర్ శ్రీనివాసరావు, సింగిల్ విండో వైస్ చైర్మన్ మోహన్, మాజీ చైర్మన్లు రాంరెడ్డి, ముకుంద రెడ్డి, డైరెక్టర్లు రామస్వామి, రవి, లచ్చయ్య, శంకర్ రెడ్డి, శ్రీహరిరెడ్డి, నాగం శ్రీనివాస్, రమేష్, మన్నెమ్మ, శోభ, నాయకులు అంజిబాబు, రవీందర్‌రెడ్డి, ధర్మ పురి శ్రీనివాస్, కనకరాజు, అనిల్‌రావు, సిరికొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 10: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి కలెక్టరేట్ జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రోడ్ల వద్ద ఉన్న ఆక్రమణలు, మున్సిపాలిటీ పరిధిలో ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించాలన్నారు. రోడ్లమీద వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన కూడళ్లలో, అప్రోచ్ రోడ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ స్థలాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. ప్రమాదాల నివారణకు ప్రస్తుతం రేడియం స్టిక్కర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లపై పిచ్చి మొక్కలు పూర్తిస్థాయిలో తొలగించాలన్నారు. వ్యవసాయదారులు కేజ్ వీల్స్ ట్రాక్టర్లు రోడ్ల మీద నడుపరాదన్నారు. ఏటా రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గాలన్నారు. రోడ్డు భద్రతా ప్రమాణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సరుకు రవాణా వాహనాలు, ఆటోలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని, జిల్లాలోని ప్రతి విద్యాసంస్థలో రోడ్డు భద్రత ప్రమాణాలపై అవగాహన కల్పించాలని అన్నారు. హెల్మెట్ ధరించకపోవడం, ట్రిపుల్ రైడింగ్, డ్రంకెన్‌డ్రైవ్, అతివేగం వంటివి ప్రమాదకరమన్నారు. జిల్లాలో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే తంగళ్లపల్లి, తిప్పాపూర్ ఎక్స్ రోడ్డు, గంభీరావుపేట, కోనరావుపేట ముస్తాబాద్, చందుర్తి, బోయినపల్లి, కోదురుపాక జంక్షన్ వంటి పలు ప్రదేశాల్లో బ్లాక్ స్పాట్‌లను గుర్తించాలని, అక్కడ రోడ్ సేఫ్టీ జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్, మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేష్, పంచాయతీరాజ్ ఈఈ సూర్య ప్రకాష్, ఆర్‌అండ్‌బీ డీఈ, ఆర్టీసీ డీఎం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఏఎస్పీ

రుద్రంగి, జూలై 10: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి అన్నారు. రుద్రంగి మండల కేంద్రం లోని పోలీస్ స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకర్ల సమా వేశంలో మాట్లాతుడూ ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాల న్నారు. ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రతా నియ మాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దన్నారు. గ్రామాల్లో గంజాయికి సంబం ధించిన సమాచారం ఉంటే పోలీసులకు అందించాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతా మన్నారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అశోక్ తదితరులు ఉన్నారు.

10 హెచ్‌పీల వరకు సబ్సిడీకి అర్హులు

సిరిసిల్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం పరిధిలోని పవర్‌లూం పరిశ్రమకు 10 పది హెచ్‌పీల వరకు విద్యుత్ సబ్సిడీకి అర్హులని, పవర్‌లూంకు సంబంధించి ఒకటి కన్నా ఎక్కువ సర్వీస్ కనెక్షన్లు ఉంటే ఒకటి, రెండు సర్వీస్ కనెక్షన్లు వాడుకొని మిగతా వాటిని తిరిగి సంస్థకు అప్పగించాలని సెస్ ఎండీ శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థకు వాపస్ చేసే సర్వీస్ కనెక్షన్లపై ప్రస్తుతం ఉన్న బకాయిని చెల్లించాలని, వాటిని సరెండర్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఒక్కో దానిపై కేటగిరీ మార్పుతో బ్యాక్ బిల్లింగ్ ఏమైనా ఉంటే ఆ బకాయిలను తమ అధీనంలో ఉంచుకోవాలని, సర్వీస్ కనెక్షన్‌పైకి మార్చి తాత్కాలిక బకాయి చూపిస్తామని స్పష్టం చేశారు. బకాయిలపై తరువాత ఏ నిర్ణయం తీసుకున్నా సెస్ వినియోగదారులు కట్టుబడి ఉండాలని తెలిపారు. అవకాశాన్ని వినియోగించుకునే వారు ఏఈఈ, ఏఏవోను సంప్రదించాలని సూచించారు.

బిల్లుల చెల్లింపును రికార్డుల్లో నమోదు చేయాలి

వీర్నపల్లి, జూలై 10: ఉపాధి పనుల్లో ప్రతీ బిల్లు చెల్లింపును రికార్డుల్లో పక్కాగా నమోదు చేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి ఫైనాన్స్ మేనేజర్ దేశాయ్ అన్నారు. వీర్లపల్లి మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో క్యాష్ బుక్, ఉపాధి బిల్లుల చెల్లింపు రికార్డులను క్షేత్రస్థాయిలో బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయంలోని అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిపారు.

ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి పాటుపడాలి



మొక్కలు నాటుతున్న డీఈవో రమేశ్

ఎల్లారెడ్డిపేట,జూలై 10: బాలబాలికలకు పోషకాహారం అందించి ఆరోగ్య కర సమాజ నిర్మాణానికి పాటు పడాలని డీఈవో రమేశ్‌కుమార్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేం ద్రంతో పాటు నారాయణపూర్, రాచర్ల తిమ్మాపూర్, హరిదాస్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలను బుధవారం పరిశీలించారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలను నాటారు. పదో తరగతి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రక్తహీనత రహిత భారతదేశం కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. రక్తహీనత రహిత భారత దేశం కార్యక్రమంలో జిల్లా పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైందన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఇన్‌చార్జి ఎంఈవో రఘుపతి, ఎంపీడీవో సత్తయ్య, ఎంపీవో వజీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన పూర్వ వీఆర్‌ఏలను రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలి

వేములవాడరూరల్, జూలై 10 : ఇతర డిపార్ట్మెంట్‌లో, మున్సిపల్ శాఖలో జూనియర్ సహాయకులు, వార్డు ఆఫీసర్‌గా సర్దుబాటైన, పదోన్నతి పొందిన పూర్వ వీఆర్‌ఏలకు ఆప్షన్స్ ఇచ్చి తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలని పదోన్నతి పొందిన పూర్వ వీఆర్‌ఏలు వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. పూర్వ వీఆర్‌ఏ జేఏసీ నాయకులు మల్లారం అర్జున్, రాకేష్, సుధీర్, అంజమ్మ, మంజుల, రేష్మ, లావణ్య, దేవేంద్ర, లక్ష్మి, స్వప్న, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

తంగళ్లపల్లి , జూలై 10: తంగళ్లపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయుడు చిలుముల శంకర్‌నారాయణ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. మాజీ ఎంపీపీ పడిగెల మానస రాజు, సిరిసిల్ల ప్యాక్స్ వైస్ చైర్మన్‌ఎగుమామిడి వెంకట రమణారెడ్డి, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ కందుకూరి రామా గౌడ్, రాపల్లి ఆనందం తదితరులు పాల్గొన్నారు.

కోర్టు సమస్యలు పరిష్కరించాలని వినతి

వేములవాడ టౌన్, జూలై 10: వేములవాడ కోర్టుకు సంబంధించిన పలు సమస్యలు పరిష్కరించాలని జిల్లా పోర్ట్ పోలియో జడ్జి, హైకోర్టు న్యాయమూర్తి రాధారాణికి బుధవారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సదానందం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ వేములవాడ రెవెన్యూ డివిజన్, పోలీస్ సబ్ డివిజన్‌లో భాగమైన కోనరావుపేట మండలం ప్రస్తుతం సిరిసిల్ల కోర్టు పరిధిలో ఉన్నందున సమస్యలు తలెత్తుతున్నాయని, ఆ మండలాన్ని వేములవాడ కోర్టు పరిధిలోకి తీసుకురావాలని కోరారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఎక్కువగా కేసులు ఉన్నందున అదనపు కోర్టు ఏర్పాటు, ప్రస్తుతం ఉన్న కోర్టు భవనంపైన మొదటి అంతస్తు నిర్మాణానికి ప్రభుత్వ పరంగా నిధులు అందించాలని పేర్కొన్నారు. అసోసియేషన్ హాల్‌ను సబ్-కోర్టుకు ఇచ్చినందున కోర్టులో న్యాయవాదుల సంఖ్య పెరిగి ఇబ్బందిగా మారిందన్నారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అవదూత రజనీకాంత్, న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, వేముల సుధాకర్ రెడ్డి, పొత్తూరి అనిల్‌కుమార్, నక్క దివాకర్, గడ్డం సత్యనారాయణరెడ్డి, నాగుల సంపత్, పంపరి శంకర్ తదితరులు ఉన్నారు.

నీటి సరఫరాకు రూ.14 కోట్ల కేంద్రం నిధులు

వేములవాడ టౌన్, జూలై 10: వేములవాడ మున్సిపల్ పరిధిలోని ప్రజల నీటి అవసరాలు తీర్చేందుకు కేంద్రం అమృత్-2లో బాగంగా రూ.14 కోట్ల నిధులు మంజూరు చేసింది. అందులో బాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి ఆధ్వర్యంలో బుధవారం అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహిం చారు. సమావేశానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సంద ర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ కేంద్రం అమృత్-2లో హిగంగా రూ. 14 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. పట్టణంలో 14 కిలో మీటర్ల మేర పైప్‌లైన్, ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి సంబంధించిన టెండర్‌ల ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. విలీన గ్రామాలతోపాటు పట్టణ విస్తీర్ణం పెరిగిందని, మరో 20 కిలోమీటర్ల మేర పైపులైన్ నిర్మాణానికి నిధుల మంజూరుకి కేంద్రాన్ని కోరుతామని తెలిపారు. వైస్ చైర్మన్ బింగి మహేష్‌ప్రజా ఆరోగ్య విభాగం ఈఈ సంపత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్‌అన్వేష్, డీఈ తిరుపతి ఉన్నారు.

ఖాతాదారుల సంక్షేమమే లక్ష్యం

వేములవాడ టౌన్, జూలై 10 : ఖాతాదురుల సంక్షేమమే కేడీసీసీ బ్యాంకు లక్ష్యమని ఆ బ్యాంకు జిల్లా చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. వేములవాడ పట్టణంలోని మండల పరిషత్ ఆవరణలో నిర్మిస్తున్న కేడీసీసీ బ్యాంకు భవన నిర్మాణ పనులు బుధవారం స్థానిక సింగిల్ విండో చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా కేడీసీసీ బ్యాంకు ఖాతాదారులకు సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. గోల్డ్‌లోన్, పౌల్ట్రీస్, దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలను అందిస్తూ రైతులకు బసటగా నిలుస్తోందన్నారు. మేనేజర్ గుంటి సాయికుమార్ తదితరులు ఉన్నారు.

పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

వేములవాడరూరల్, జూలై 10 : పోస్టల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ పోస్టల్ సూపరింటెండెంట్ శివాజీ అన్నారు. వేములవాడ రూరల్ మండలం వట్టెంల పోస్టల్ ఆఫీస్‌లో బోయినపల్లి మండలం దుండ్రపల్లికి చెందిన కందుల భూమారెడ్డి టాటా జీఏజీ ప్రమాద బీమా చేశారు. భూమారెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా కుటుంబానికి రూ. 10 లక్షల చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా పోస్టల్ ఎస్పీ శివాజీ, మేనేజర్ రాజేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బీమా చేసుకోవాలని సూచించారు. మేనేజర్ రేవతి, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్, ఎస్‌పీఎం స్వామి పాల్గొన్నారు.

ప్రైవేట్ బ్యాంక్ రుణం కట్టలేక నేత కార్మికుడి ఆత్మహత్యా యత్నం

తంగళ్లపల్లి, జులై 10: ప్రైవేట్ బ్యాంక్ రుణం తిరిగి చెల్లించలేక తంగళ్లపల్లి మండలం మండెపల్లి కేసీఆర్ నగర్ కాలనీకి చెందిన నేత కార్మికుడు గాజుల వేణు ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికుల వివరాల ప్రకారం... కొన్ని ప్రైవేట్ బ్యాంకులు కేసీఆర్ నగర్‌లోని కార్మికులను టార్గెట్ చేసుకొని 10 మంది చొప్పున గ్రూప్ ఏర్పాటు చేసి ఒక్కొక్కరికి రూ. 40వేలు రుణాలు ఇస్తున్నాయి. తీసుకున్న రుణం 15 రోజులకో కిస్తీ చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. పని సక్రమంగా లేకపోవడంతోపాటు పేదరికంతో చాలా మంది కార్మికులు ఒక్కొక్కరు నాలుగు ఫైనాన్స్‌ల వద్ద రుణాలు తీసుకున్నట్లు తెలిసింది. నరేశ్ సైతం రుణం తీసుకున్నాడు. కిస్తీ చెల్లించే పరిస్థితి లేక పోవడంతో బుధవారం ఇంట్లో ఉరేసుకోగా గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆసుత్రికి తరలించారు. ప్రస్తుతం నరేశ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. ఈ విషయమై ఎస్సైని వివరణ కోరగా తమ దృష్టికి వచ్చిందని, విచారిస్తున్నామని తెలిపారు.

వేములవాడలో బోనాల జాతర



మత్తడి పోచమ్మ బోనాల పండుగలో ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, జూలై 10 : వేములవాడ పట్టణంలో బుధవారం బోనాల పండగ నిర్వహించగా జాతరను తలపించింది. పట్టణంలోని బద్ది పోచమ్మ అమ్మవారికి, మత్తడి పోచమ్మ అమ్మవారికి తూర్పువాడ మున్నూరుకాపు సంఘం, ఆరెకటిక సంఘం, లాడ్డి అసోసియేషన్, గోల్డెన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా బోనాలను తీశారు. ఈ సందర్భంగా మహిళలు నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు.

● వేములవాడ పట్టణంలోని తూర్పువాడ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాలతోపాటు మత్తడి పోచమ్మ అమ్మవారిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఆరెకటిక సంఘం, లాడ్డి అసోసియేషన్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాలకు హాజరైన ప్రభుత్వ విప్ అమ్మవార్లను దర్శించుకున్నారు. తూర్పువాడ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాలకు బీఆర్‌ఎస్ సీనియర్ నేత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

కార్మికుల ఆత్మహత్యలు పట్టని ప్రభుత్వం

సిరిసిల్ల టౌన్, జూలై 10 : పరిశ్రమ సంక్షోభంతో ఉపాధి లేక సిరిసిల్ల నేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే తెలంగాణ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని లాల్ బావుట చేనేత, పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ వైఫల్యంతో సిరిసిల్ల పవర్‌లూం పరిశ్రమ సంక్షోభం లోకి వెళ్లిందన్నారు. ఆరు మాసాలుగా ఉపాధి లేకుండా పోవడంతో సిరిసిల్ల ప్రాంత నేత కార్మికులు ఆత్మహత్యలకు గురవడం బాధాకరమన్నారు. ఈ రోజు కూడా మండెపల్లిలో ఓ కార్మికుడు ఆత్మహత్యకు యత్నించాడని, సిరిసిల్ల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు ఉపాధి లేక ఆత్మహత్యలు చేసుకుం టున్నా ముఖ్యమంత్రి, మంత్రులు స్పందించక పోవడంపై బాధాకరమన్నారు. ఆత్మహత్యలకు పాల్పడిన కార్మికుల కుటుంబ సభ్యులను రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పరామర్శించక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. బతుకమ్మ చీరల బకాయిలు విడదల చేస్తున్నామం టున్నారని, ఇప్పటి వరకు ఎన్ని డబ్బులు విడదల చేశారో స్పష్టత లేదని అన్నారు. స్పందించని పక్షంలో ఈ నెల 15న సిరిసిల్లలోని చేనేత, జౌళి శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామ న్నారు. లాల్ బావుట చేనేత, పవర్‌లూం కార్మిక సంఘం అధ్యక్షుడు అజ్జ వేణు, నాయకులు పాల్గొన్నారు.

సార్ మీరు వెళ్లొద్దు.. ఇక్కడే ఉండాలి



ఉపాధ్యాయుడి చుట్టూ చేరిన విద్యార్థులు

చందుర్తి, జూలై 10 : ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్తుండడంతో తట్టుకోలేక చిన్నారులు కంట తడిపెట్టారు. 'సార్ మీరు వెళ్లొద్దు. ఇక్కడే ఉండాలి. మాకు మీరే పాటలు చెప్పాలి' అని బతిమిలాడారు. చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యా యుడు నరేష్ 13 ఏళ్లుగా పని చేస్తున్నాడు. బుధవారం బోయినపల్లి మండలం జగ్గారావుపల్లి ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యాడు. ఉపాధ్యా యుడు పాఠశాల నుంచి వెళ్తున్నాడని తెలుసుకున్న చిన్నారులు తట్టుకోలేకపోయారు. ఉపాధ్యాయుడి చుట్టూ చేరిన విద్యార్థులు సార్ మీరు వెళ్లొద్దం టూ కన్నీరు పెట్టుకున్నారు. పిల్లలు ఏడవడం చూసి ఉపాధ్యాయుడు కూడా కన్నీళ్లు తెచ్చుకున్నాడు. సార్ తమను సొంత పిల్లల కన్న ఎక్కువగా చూసుకున్నారని విద్యార్థులు పేర్కొన్నారు.

పల్లెల ప్రగతికి ప్రత్యేక చర్యలు

ఎల్లారెడ్డిపేట, జూలై 10: పల్లెల ప్రగతికి పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి, దేవునిగుట్టతండా గ్రామాలను బుధవారం పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో రికార్డులను తనిఖీ చేశారు. గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డు, కంపోస్టు షెడ్డులను పరిశీలించారు. మురుగు నీటి కాల్వలు, రోడ్లు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాటిన ప్రతీ మొక్క బతికేలా నీటిని అందించాలని సూచించారు. వానాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు. తడి,పొడి చెత్తను ప్రజల నుంచి సేకరించడంతోపాటు వేరు చేసి ఎరువు తయారు చేయాలన్నారు. ఎరువుతోపాటు వేరు చేసిన పొడి చెత్తను విక్రయించాలని, పంచాయతీలకు ఆదాయం సమకూరేలా చూడాలని అన్నారు. గ్రామాల్లోని హోటళ్లు, చికెన్, మటన్, వ్యాపార దుకాణాల వద్ద సంబంధిత నిర్వాహకులు చెత్తబుట్టలను ఏర్పాటు చేసుకోవాలని, రహదారులపై చెత్తచెదారం లేకుండా సహకరించాలని కోరారు. పారిశుధ్యం, మొక్కల సంరక్షణతోపాటు ఇంటి పన్నులు, లైసెన్స్ రుసుం వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎంపీడీవో సత్తయ్య ఎంపీవో వజీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



వివరాలు తెలుసుకుంటున్న జిల్లా వైద్యాధికారి

ఇల్లంతకుంట, జూలై 10: సీజనల్ వ్యాదులపై ప్రజల్లో అవగాహన పెంచాలని జిల్లా వైద్యాధికారి సుమనమోహన్‌రావు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి, అనంతగిరిలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంచకుండా ప్రజలకు వివరించాలన్నారు. వాంతులు, విరేచనాలు ఉంటే ఉన్నతస్థాయి అధికారులకు సమాచారం అందించాలన్నారు. గర్భిణులు ప్రతీనెల క్రమం తప్పకుండా ఆస్పత్రికి వచ్చేలా చూడాలని, సుఖప్రసవాల సంఖ్య పెంచాలని అన్నారు. మండలంలో క్షయవ్యాధిపై అడిగి తెలుసుకున్నారు. వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి శరణ్య, ఆయుర్వేద వైద్యాధికారి శరణ్య, హెచ్ఈవో రమణ, హెల్త్ సూపర్‌వైజర్ నయీం, జవహర్ పాల్గొన్నారు.

అభివృద్ధికి పెద్ద పీట వేద్దాం

ముస్తాబాద్, జూలై 10: అభివృద్ధికి పెద్ద పీట వేద్దామని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రం నుంచి దుబ్బాక రహదారికి మంజూరైన రూ.14 కోట్ల నిధులను తిరిగి రద్దు చేయడంపై బీఆర్‌ఎస్ నాయకులు మండిపడ్డారు. రూ.14 కోట్ల నిధులు మంజూరు చేసి అగ్రిమెంటై కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రద్దు చేయడంపై ఆంతర్యం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దొంగ సొత్తు కొనవద్దు

తంగళ్లపల్లి, జూలై 10: స్క్రాప్ షాప్ యజమానులు దొంగ సొత్తు కొనవద్దని, అలా చేస్తే నేరం చేసినవారవుతారని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి అన్నారు. బుధవారం తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో మండల పరిధిలోని పాత ఇనుప సామగ్రి కొనుగోలు చేసే దుకాణా యజమానులు, ఊరూరా తిరిగి కొనే వర్తకులకు అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సీఐ మాట్లాడుతూ దొంగ సొత్తు అమ్మకానికి తీసుకొస్తే కొనకూడదన్నారు. వచ్చిన వారి వివరాలు పోలీసులకు చేరవేయాలన్నారు. సమావేశంలో ఎస్సై సుధాకర్‌పాల్గొన్నారు.

సామాజిక సేవతో ప్రజల్లో గుర్తింపు

ఇల్లంతకుంట, జూలై 10: పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులు సామాజిక కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని మాజీ సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్ అన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్, దాచారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కరివెద స్వప్నకర్ణాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్‌రావు, రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేయాలి

తంగళ్లపల్లి, జులై 10: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తంగళ్లపల్లికి చెందిన నాయకులు నులుగోండ శ్రీనివాస్, గజభీంకర్ సంతోష్ కలెక్టర్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. గతేడాది పాఠశాల తరగతి గదులను కూల్చి సీఎస్ఆర్ నిధులతో మోగా కంపెనీ అధునాతన హంగులతో పాఠశాల భవనం నిర్మాణం చేపడుతామని పనులు మొదలు పెట్టి మధ్యలోనే చేతులెత్తిసిందన్నారు. సుమారు 400 మంది విద్యార్థులు తరగతి గదులు, వంట చేయడానికి వంట గది లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

ప్రమాదవశాత్తు నీట మునిగి బాలిక మృతి

రుద్రంగి, జూలై 10: రుద్రంగి మండలం వీరునితండాకు చెందిన గుగులోతు నక్షత్ర(14) అనే విద్యార్థిని ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో నీట మునిగి మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. వీరునితండాకు చెందిన మర్రిపల్లిలోని గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. మంగళవారం శీత్లా భవాని పండగ కోసం ఇంటికి వచ్చింది. బుధవారం స్నేహితులతో కలిసి గ్రామ శివారులోని వ్యవసాయ బావి వద్దకు స్నానానికి వెళ్లింది. మొదటగా బావిలోకి దిగిన నక్షత్ర ప్రమా దవశాత్తు నీట మునిగింది. స్నేహితులు వెంటనే కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. నక్షత్ర ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందిదని తల్లి అనిత ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

రేపు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, జూలై 10: ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శుక్రవారం పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ రామచంద్రం బుధవారం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని లక్ష్మీమల్లారెడ్డి కన్వేషన్ హాలులో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు సమావేశం

తంగళ్లపల్లి, జులై 10: తంగళ్లపల్లి మండలం చిన్న లింగాపూర్ పాఠశాలలో పదోన్నతి పొందిన సీపీఎస్ ఉపాధ్యాయ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు అయ్యన్న గారి హరికృష్ణ రెడ్డి, నర్రా అంజిరెడ్డితోపాటు బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయిని పావనిని సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సై ఆత్మహత్య కారకులపై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల టౌన్, జూలై 10: భద్రాది కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు బుధవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. శ్రీనివాస్ భార్య ఫిర్యాదులో పేర్కొన్న పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ నమోదు చేయాలని, సర్వీస్ నుంచి తొలగించాలని పేర్కొన్నారు.

ప్రజల పక్షాన పోరాటం చేద్దాం



సన్మానిస్తున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడ టౌన్, జూలై 10: ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేయాలని బీఆర్‌ఎస్ వేములవాడ నియోజవకర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. నియోజవర్గం పరిధిలో పదవీకాలం ముగిసిన ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలను పట్టణంలోని ఆయన నివాసంలో బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా జీవితంలో నిజాయితీగా పని చేసిన వారికి ఎప్పటికీ గుర్తింపు ఉంటుందన్నారు. ప్రజా ప్రతినిధుల హోదాల్లో మీరు చేసిన అభివృద్ధి పనులు ఎప్పటికీ ప్రజల్లో గుర్తిండి పోతాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రాలేదన్నారు. ఎన్నికల్లో అమలుకు నోచుకోని హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేశారని, ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంపైన పూర్తిగా నమ్మకం పోయిందని అన్నారు. బీఆర్‌ఎస్ వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, మహిళలు కేసీఆర్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా ఏమిటో మరోమారు చూపించనుందన్నారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, మధ్యమానేరు నిర్వాసితులకు రూ. 5 లక్షల 40 వేలు ఇస్తామన్న హామీకి సైతం కటాఫ్ తేదీ ప్రకటించాలని స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు సవాల్ విసిరారు. ఈ స మావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, నాయకులు పాల్గొన్నారు.

కేకే మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు



సిరిసిల్లలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 10 : కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం సిరిసిల్ల పట్టణం గాంధీచౌక్ వద్ద పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ కేక్ కట్ చేశారు. పార్టీ మహిళా విభాగం మాజీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ కౌన్సిలర్ మడుపు శ్రీదేవి ఆధ్వర్యంలో శ్రీనివాస చారిటబుల్ ట్రస్టులోని వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశంగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఖాజామొయినుద్దీన్, అశోక్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, పట్టణ అధ్యక్షుడు నర్సయ్య, మహి ళ జిల్లా అధ్యక్షురాలు వనితనళినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

● న్యాయవాదుల ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు.

● పరిధిలోని 39వ వార్డు కాంగ్రెస్ అధ్యక్షుడు పిట్టల శ్రీకాంత్ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని విలీన గ్రామాల్లో మహేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. పలువురు నాయకులు హైదరాబాద్‌లోని కేకే మహేందర్‌రెడ్డి స్వగృహానికి వెళ్లి జ్ఞాపికను అందజేశారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

ముస్తాబాద్: ముస్తాబాద్‌తోపాటు గూడెం, నామాపూర్, పోత్గల్ గ్రామంలో మహేందర్‌రెడ్డి జన్మదినం నిర్వహించారు.

గంభీరావుపేట/వీర్నపల్లి: గంభీరావుపేట, వీర్నపల్లి మండలాల్లో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేశారు. బంజేరు ప్రాథమిక పాఠశాలలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతి యాదవ్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.